క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోండి

మల్దకల్: జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హరికృష్ణ కూలీలకు సూచించారు. శుక్రవారం మండలంలోని మంగంపేట, ఎల్కూరు, సద్దలోనిపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.

వంతెనలు నిర్మించండి

రాజోళి: మండలంలోని గ్రామాల్లో ఉన్న వాగులపై వంతెనలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రం నుంచి ముండ్లదిన్నె, మాన్‌దొడ్డి–నారోజీ క్యాంపు, మాన్‌దొడ్డి–తుమ్మిళ్లకు వెళ్లే మార్గాల్లో ఉన్న వాగులు వర్షాకాలం వచ్చిందంటే రోడ్డెక్కి ప్రవహిస్తుంటాయని, దీంతో రాకపోకలు నిలిచిపోతాయని వాపోతున్నారు. వర్షాకాలంలో వాటి నిర్మాణం చేపట్టడం కుదరదని, అందుకే ప్రస్తుతం వేసవికాలం కావడంతో వాగులపై వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాయకుల ప్రచారం

అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు మండలంలోని వెంకటాపురం, యాపదిన్నె, కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలిపారు. భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివారెడ్డి, గోపాల కృష్ణ, సురేష్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనాలు నిర్మించండి

రాజోళి: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం కొత్త భవనాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంగా ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు భవనాల ఊసే లేదని, అద్దె భవనాలు, కాలం చెల్లిన భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. కొన్ని భవనాల్లో విష సర్పాలు సంచరిస్తున్నా, వాటికి కనీసం మరమ్మతు కూడా చేపట్టడం లేదని చెబుతున్నారు. శాఖల వారీగా భవనాలు నిర్మిస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడుకు చెందిన చాకలి రాముడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ భర్త అయిన రాముడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గోపాల్, మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పక్కనే ఉన్నా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేక ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి వెంట నిత్యం పాదాచారులు, వాహనాదారులు ప్రయాణిస్తుంటారు. చాలాసార్లు అధికారులకు తెలిపినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ప్రమాదాలు జరుగకముందే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తాగునీటి సమస్య తీరేనా?

- జూలెకల్‌లో 2,121 జనాభా
- పూర్తిస్థాయిలో నీరందక ఇబ్బందులు
- 1.80 లక్షల లీటర్లకు బదులుగా 1.20 లక్షల లీటర్ల సరఫరా
- చేతిపంపులు, బోర్లకు మరమ్మతు చేయాలని వేడుకోలు



నిరుపయోగంగా చేతిపంపు



జూలెకల్ బీసీ కాలనీలో బోరు బావి నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

శాంతినగర్: కుళాయిల ద్వారా సరఫరా అయ్యే మిషన్‌భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో గ్రామాల్లోని ప్రజలకు దాహార్తి తీరే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం అరకొరగా అందుతున్న నీళ్లు ఏప్రిల్, మే నెలల్లో తాగడానికి నీరందక దాహంతో అల్లాడే పరిస్థితులు ఉంటాయని వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో మొత్తం 2,121 జనాభా ఉన్నారు. ప్రజల అవసరాల కోసం జూలెకల్‌లో 3, స్టేజిలో ఒక ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నప్పటికి మిషన్‌భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో తీవ్ర నీటి సమస్యతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో ఉన్న చేతిపంపుల పైపులు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. బోరు బావులకు ఏర్పాటు చేసిన మోటార్లు కాలిపోయి కాలనీల్లో నీరులేక ఇతరుల ఇళ్ల వద్ద ఉన్న బోరు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు, బోరు బావులు

గతంలో ఏర్పాటు చేసిన 9 చేతిపంపుల్లో మూడు పనిచేస్తుండగా ఆరు నిరుపయోగంగా ఉన్నాయి. ఏడు బోరు బావులుండగా రెండు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చేతి పంపులు తుప్పుపట్టగా మరి కొన్ని పైపులు లేక పనిచేయడంలేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. బోరు బావులకు ఏర్పాటు చేసిన మోటారు కేబుల్ వైర్లులేక పనిచేయడం లేదని, దీంతో కేవలం మిషన్ భగీరథ నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఎస్సీ కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లు తీయడం వల్లే సమస్య

మిషన్‌భగీరథ కొళాయిలకు ఏర్పాటు చేసిన గుండ్లు తీసేయడం వల్లే సమస్య తలెత్తుతోందని అధికారులు చెబుతున్నారు. కుళాయిలకు ఏర్పాటుచేసిన గుండ్లు తీయకపోతే అందరికి నీరు సమానంగా వస్తుంది. కొందరు తీయడం వల్లే సమస్య తలెత్తుతోందని అధికారులు వాపోతున్నారు.

బతిమిలాడుతున్నాం..



కుళాయిలకు నీళ్లు సరిగా రాకపోవడంతో మా కాలనీలో బోరుబావులు ఉన్న వారి ఇళ్ల వద్ద నుంచి బతిమలాడి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో మా పరిస్థితి ఏమి. పనిచేయని చేతిపంపులు, మోటార్లు రిపేర్ చేయించి నీటి సమస్య లేకుండా చూడాలి. – ఝూన్సీలక్ష్మిదేవి, జూలెకల్

20 రోజులే వస్తాయంటున్నారు..



మిషన్‌భగీరథ నీరు మరో 20 రోజులు మాత్రమే వస్తాయని చెబుతున్నారు. కుళాయిలు బంద్ అయితే మా పరిస్థితి ఏమి. తాగడానికి, దుస్తులు ఉతుక్కోడానికి, ఇంట్లోకి ఎక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవాలి. నాలుగేళ్లుగా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. వెంటనే చర్యలు చేపట్టి నీటి సమస్య తలెత్తకుండా చూడాలి. – రాధ, జూలెకల్

పశువుల పరిస్థితి ఎలా..



గ్రామంలోని ప్రజలకు సరిపడా నీరు అందడంలేదు. పశువులకు నీరు లేకపోవడంతో పంట పొలాల్లోని బోరు బావుల వద్దకు వాటిని తీసుకెళ్లి నీరు తాగిస్తున్నాం. ఊర్లో సంపులు ఏర్పాటుచేసి నీటిని నింపి ఆవులు, ఎద్దులు, గేదెలకు దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి. – చిన్నస్వామి, జూలెకల్

చర్యలు తీసుకుంటాం..

మూడు రోజుల క్రితం గ్రామంలో సమస్య తలెత్తింది. గ్రిడ్ పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతు చేపట్టాం. ప్రస్తుతం బాగానే నీటి సరఫరా చేస్తున్నాం. నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపుతున్నాం. గ్రామస్తులకు 1.80లక్షల లీటర్లు అవసరం ఉంటుంది. ప్రస్తుతం 1.20లక్షల లీటర్లు సరఫరా అవుతున్నాయి. రెండు మండలాలకు సంబంధించి ఒకే మెకానిక్ ఉన్నారు. గ్రామాలు తిరిగి చేతిపంపులు, బోరు బావుల వివరాలు తీసుకున్నాం. ఈనెలాఖరులోగా నిరుపయోగంగా చేతిపంపులు, బోరు మోటార్లకు మరమ్మతు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. – వంశీసాగర్, ఏఈ, మిషన్‌భగీరథ ఇంట్రా, వడ్డేపల్లి మండలం

రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు



మానవపాడు: మండలంలోని చాలా గ్రామాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ముళ్ల కంపలు దర్శనమిస్తున్నాయి. గోకులపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ గ్రామానికి, మానవపాడు నుంచి గోకులపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు రోడ్ల గుండా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఓటరు చైతన్య ర్యాలీలో ఆర్డీఓ నవీన్

మహబూబ్‌నగర్ రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ నవీన్ అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని నలంద ఆటోస్టాండ్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో ఓటరు చైతన్య కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అన్నారు. గతంలో తక్కువ ఓటింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగం

లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగానికి సంబంధించి అర్హత కలిగిన 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగ ఓటర్లకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆర్డీఓ నవీన్ సూచించారు. గతంలో ఉన్న 80 ఏళ్ల వయస్సు పరిమితిని 85 ఏళ్లకు పెంచారని తెలిపారు. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగానికి ఈనెల 22 నుంచి ఏప్రిల్ 22 వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. శుక్రవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్ల నుంచి ఫారం–12డీ ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఆ తర్వాత వాటిని పరిశీలించి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఘన్సీరామ్, సుందర్‌రాజ్, కిష్యానాయక్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మానవపాడు: మండలంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద శుక్రవారం ఎస్‌ఐ చంద్రకాంత్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. అత్యవసరం ఉంటే నగదుకు రశీదులు ఇచ్చితంగా తమ వెంట ఉండాలని తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఎవరూ కూడా వ్యతిరేకంగా వ్యవహరించరాదని పేర్కొన్నారు.

ఎర్రవల్లి చౌరస్తాలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎర్రవల్లి, పెబ్బేరు, కర్నూలు నుంచి గద్వాల వైపు, అలాగే గద్వాల, రాయచూరు ప్రాంతాల నుంచి ఎర్రవల్లి వైపు వెళ్తున్న వాహనాలను ఎస్‌ఐ తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దంతనూరును వణికిస్తున్న జ్వరాలు





వ్యాధి బారినపడిన దంతనూరు గ్రామస్తులు

- నరకం అనుభవిస్తున్న గ్రామస్తులు
- కీళ్లు, కాళ్ల నొప్పులతో ఇబ్బందులు

మదనాపురం: మండలంలోని దంతనూరు గ్రామస్తులు వారం రోజులుగా అంతుచిక్కని ఓ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధి ఊరంతా చుట్టేసింది. మొదట్లో కాళ్ల, కీళ్ల నొప్పులతో ప్రారంభమైన ఈ వ్యాధి లక్షణాలు దేహమంతా వ్యాపిస్తుంది. జ్వర బాధితులు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో చికెన్‌గున్యా లక్షణాలు ఉన్నాయని స్థానిక వైద్య అధికారులు క్యాంపు ఏర్పాటు చేసి మందులు అందించారు. మెడిసిన్ వాడిన కొన్ని రోజులు మాత్రమే తగ్గింది. తర్వాత తిరిగి బాధితుల సంఖ్య పెరిగింది.

ఇంటిల్లిపాదికీ..

ఇంట్లో ఒక్కరు, ఇద్దరితో ప్రారంభమైన ఈ రోగం క్రమంగా అందరికీ అంటుకుంటుంది. వ్యాధి బారిన పడినవారు కదలలేని స్థితిలో మంచాలకే పరితమయ్యారు. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. కానీ పేదలు మాత్రం నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య క్యాంపులో ఇచ్చిన మందులను వాడి వేసుకొని కాలం గడుపుతున్నారు. 4 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ఇప్పటికే దాదాపు 50 మందికి పైగా మంచాన పడ్డారు.

అప్రమత్తమైన అధికారులు

ఊరంతా రోగం రోగం వచ్చిందని గుర్తించిన అధికారులు 13వ తేదీ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. 51 మంది రోగులకు సంబంధించిన రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో ఏ క్షణం ఏ వార్త వినాల్సి వస్తుందని ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. ఈ అంతుచిక్కని వ్యాధిపై జిల్లా వైద్య ఉన్నతాధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాళ్ల నొప్పులతో..



నేను మూడు రోజుల నుంచి కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నా ను. జ్వరం వచ్చింది. ఇలాంటి నొప్పులు ఎప్పుడూ చూడలేదు. నరకయాత్ర అనుభవిస్తున్నాను. ఏం చేయాలో దిక్కుతోచక భయం భయంగా గడుపుతున్నాం. అధికారులు స్పందించి ఈ అంతుచిక్కని వ్యాధిని నయం చేసి ఊరిని కాపాడాలి. – రాజు, దంతనూరు

నడవలేని స్థితిలో..



నాకు కాళ్లు కీళ్ల నొప్పులతో జ్వరం వచ్చింది. నడువలేని స్థితిలో ఉన్నాను. తిందామంటే తినబుద్ధి కావడం లేదు. ఇంటి ముందు ఇంటి వెనక ప్రతి ఇంట్లో రోగులు ఉన్నారు. భయం భయంగా గడుపుతున్నాం. కీళ్ల వాపులు వస్తున్నాయి. – అనిత, దంతనూరు

సూదులతో పొడిచినట్లు ఉంది



మోకాలు వాచి సూదులతో పొడిచినట్లు గుంజుతున్నాయి. జ్వరం వస్తే చాలు లేవలేని స్థితిలోకి వెళ్లిపోతున్నాం. కూలీ పనులు చేసుకొని బతికే మాకు ఇలాంటి రోగాలు రావడంతో దిక్కుతోచక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ అధికారులు స్పందించి నయం చేయాలి.

వైరల్ ఫీవర్‌తోనే ఇబ్బంది



వైద్య క్యాంప్ ఏర్పాటు చేసి వ్యాధి లక్షణాలు గల 51 మందికి పరీక్షించి రక్త నమూనాలు తీసుకున్నాము. టైఫాయిడ్, మలేరియా, చికన్ గున్య, డెంగీ మరియు మొదలగు పరీక్షలు చేసాము. టైఫాయిడ్ కేసు లు మాత్రమే వచ్చాయి. భయపడాల్సిన అవసరం లేదు. వైరల్ ఫీవర్‌గా గుర్తించాము. శనివారం

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

మల్దకల్: మండలంలోని అమరవాయి స్టేజి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజలు, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్, చిన్న తిమ్మన్న, తిప్పన్న, మద్దిలేటి, భాస్కర్, రంగస్వామి, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని పెద్దపాడు చెందిన ఎలిజబెత్ అనారోగ్యంతో బాదపడుతూ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

గద్వాల అర్బన్: చిరుధాన్యలతో తయారు చేసిన ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ హేమలత అన్నారు. పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో చింతలపేటలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సాముహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం గర్భిణులు తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంతకు ముందు పౌష్టికాహార పదార్థాలు, చిరుధాన్యలను ప్రదర్శించారు.

రక్తహీనతను దూరం చేద్దాం

గట్టు: మహిళల్లో రక్తహీనతను దూరం చేద్దామని, ఇందుకోసం అందరి సహకారం అవసరమని మల్దకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ కమలాదేవి కోరారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో సమావేశాన్ని నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. దీనిని దూరం చేయడానికి తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు.

వేసవి దుక్కులపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతువేదికలో శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహ ఆధ్వర్యంలో వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈఓ మాట్లాడుతూ రైతులు రబీ పంటలు కోయగానే పొలాన్నిఅలాగే వదిలేసి తొలకరి జల్లులు కురిసిన తర్వాత ఖరీఫ్ కోసం దుక్కులు దున్నడం మొదలుపెడతారని దీనివల్ల దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అలా కాకుండా వేసవిలోనే దుక్కులు దున్నుకోవడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. వేసవిలో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అలాగే లోతుగా దున్నడం వల్ల లోతైన పొరల నుంచి నీరు ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. భూమిపై పడిన ప్రతి వర్షపు బిందువు కూడా అక్కడికక్కడే ఇంకి నీరు పరిరక్షించబడుతుందని తెలిపారు. వర్షాధార పంటలు వివిధ కీలక దశల్లో బెట్టకు గురైనప్పుడు లేదా తక్కువ వర్షపాతం నమోదైనప్పుడు పంట వేర్లు లోపలికి పోవడం వల్ల నేల లోపలి పొరల్లోని తేమను, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తిని చేకూరుస్తుందన్నారు. ముఖ్యంగా భూమి లోపలి పొరల్లోని మట్టి పైకి, భూమి పైమట్టి లోపలి పొరల్లోకి కలిసి పోవడం ద్వారా భూసారం సమానంగా మొక్కలకు అందడంతో అధిగ దిగుబడి వస్తుందన్నారు. ప్రతి రైతు కూడా వేసవిలో దుక్కులు దున్నాలని సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



మద్దూరులో పాతబోరును పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దూరు, కొర్విపాడు, చంద్రశేఖర్ నగర్, కలుకుంట్ల, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు, గోకులపాడును వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు పలు చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పాత బోర్లను వెంటనే మరమ్మతు చేయించాలని తెలిపారు. ట్యాంకులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా పైపులైన్లు లీకేజైతే వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా ప్రజలు ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రాఘవేందర్, ఎంపీఓ చంద్రశేఖర్, కార్యదర్శులు ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

గద్వాల వ్యవసాయం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వేస్తున్న నివారణ టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసకోవాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని కాకులారం, కొండపల్లి, పట్టణంలోని గంజిపేటలో పశువైద్య సిబ్బంది 46మంది రైతులకు చెందిన 538 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తేజస్విని, కృష్ణయ్య, రాముడు, జహంగీర్, ఫణీంద్రరాజు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని తుమ్మలపల్లి, బల్గెరలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు పశువైద్యాకారి శంకరయ్య తెలిపారు. రైతులు పశువులకు తప్పని సరిగా టీకాలను వేయించాలని పశువైద్యాధికారి తెలిపారు. రెండు గ్రామాల్లో మొత్తం 68 మంది రైతులకు చెందిన 202 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు.

అయిజ: టీకాలు వేయించి వ్యాధిని అరికడదామని వెటర్నరీ అసిస్టెంట్ జర్జన్ స్వరూప రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న తాండ్రపాడు, సింధనూరులో వెటర్నరీ సిబ్బంది 1,067 పశువులకు టీకాలు వేశారు.

బీటీ పనులు వేగవంతం చేయాలి

రాజోళి: మండలంలో బీటీ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులను ఇప్పటి దాకా పూర్తి చేయకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, దానికి తోడు టిప్పర్లు తిరుగుతుండటంతో గుంతలమయంగా మారి, ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాలకు వెళ్లే రహదారులతో పాటు ప్రధాన రోడ్లు దారుణంగా మారుతున్నాయని, వాటికి కనీసం మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టెంకాయల టెండర్ వాయిదా

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించి శుక్రవారం టెండర్లు జరగాల్సి ఉండగా వాయిదాపడింది. కాగా టెంకాయల ధరలను పెంచి విక్రయిస్తామని టెండరుదారులు ఆలయ అధికారులకు వివరించారు. అయితే గతంలో ఉన్న ధరలకు మాత్రమే విక్రయించాలని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో టెండరుదారులు వెనుదిరిగారు.